# వేకువ

- మన్నాటి

అర్థరాత్రి మొదలయింది వర్షం!

పొడు వర్షం! పడితే జోరుగా ఆనందంగా కుండపోతగా పడొచ్చుగా! లేదా అసలు పడకుండానే ఉండచ్చుగా! అదీలేదు - ఇదీలేదు. మధ్యరకంగా పడీ పడనట్లుగా పడక పడినట్లుగా పడుతోంది. తెల్లవారుతున్నా తగ్గే సూచనలు కన్పించడం లేదు.

నా హృదయంలో పెల్లుబుకుతున్న ఆనందానికి అడ్డు వస్తోందీ వర్షం. నా సంతోషాన్నించి నన్ను వీలయినంత దూరం చేయడానికి ప్రయత్నిస్తోంది.

అనుకోకుండా నా పెదాల మీద చిర్నవ్వు వెలిగింది.

నా హృదయంతో ప్రకృతికి సంబంధమేముందని?

అంతలోనే మరో ఆలోచన-

ఈ ప్రకృతే లేకపోతే నేనూ-నాకో హృదయం అంటూ ఉండేవా?

కాబట్టి- ఈ ప్రకృతే ఏర్పరచిన నా హృదయానికి తగ్గట్టుగా తనకి స్పందించవలసిన బాధ్యత లేదా?

ఏమో?

నాకు మళ్ళీ నవ్వొచ్చింది-కొద్దిగా -పెద్దగా!

దాంతో కేక విన్పించింది-కొంపలంటుకు పోయినట్లుగా- మా అత్తగారి కేక అది.

"మొగుడు చచ్చినా ముండకి నవ్వొస్తోంది. రాక్షసి. ఇది వచ్చి తగలడ్డాకే ఇంట్లో అశుభాలు మొదలయ్యాయి."

ఊహించని విధంగా నా దగ్గరకొచ్చి జుట్టు పట్టుకుని ఈడ్చి రెండు సార్లు నా వీపు మీద గుద్దింది- పిడికిలితో.

నాకు ఏమీ బాధనిపించలేదు. పైగా ఆనందంగా ఉంది.

'ఏడవాలి! ఇంకా ఏడవాలి అత్తగారూ! మీరింకా ఏడవాలి. ఆ ఏడ్పులో ఆ బాధలో ఏం చేస్తున్నారో మీకే తెలీకుండా బావిలో దూకాలి' అనుకున్నా మనసులో.

ఆ చుట్టు పక్కల కూర్చుని ఉన్న నా భర్త తరవు బంధువులు నోరెళ్ళబెట్టారు- అప్రయత్నంగా నా పెదవుల మీద మళ్ళీ ముసురుకున్న నవ్వుని చూసి,

"ఆడది కాదు పిశాచి" అర్చింది పెద్దగా- ఆరుగురు పిల్లల తల్లీ- సెక్స్ పుస్తకాలు చదివే అలవాటుండీ- ఇంట్లో పనివాళ్ళ దగ్గిర్నుండి ఇంటికొచ్చిన మగాళ్ళనందర్నీ ఓరగా చూసి రెచ్చగొట్టే ప్రయత్నాలు చేసే నా భర్తగారి అక్కగారు.

ఇదిగో! నాకు మళ్ళీ నవ్వొస్తోంది- ఆవిడగారు చేసిన ఘనకార్యం గుర్తు చేసుకుంటూంటే.

పనివాడితో నాకు సంబంధాన్ని అంటగట్టి, నా భర్తతో నన్ను రక్తం చిట్లేట్లు కొట్టించిన సంస్కారి ఆవిడ.

ఆవిడ కోర్కెను తీర్చనందుకు ఆ పనివాడు కూడా నరకయాతన అనుభవించాడు. కానీ అతడ్ని పనిలోంచి తీసివేయనీయలేదు ఆవిడ. నేడు కాపోతే రేపయినా వాడు వింటాడన్న నమ్మకం ఉంది ఆవిడకి. ఆవిడ భర్త ఆమె చెప్పుకింద తేలులా మసలుకుంటాడు. ఆవిడ ఆడిందే ఆట! పాడిందే పాట! ఇన్నాళ్ళూ- కానీ-

ఇప్పుడేమయింది? ఏ తమ్ముడ్ని చూసుకుని ఆవిడ అంత ధైర్యంగా ప్రవర్తించేదో అందరి మీదా అధికారం చెలాయించేదో- ఆ మహానుభావుడు విగతజీవుడై పడిఉన్నాడు ముందు గదిలో!

ఇల్లంతా నిర్లిప్తంగా ఉంది. సాయంత్రం నుండీ నా భర్త కోసం ఏడవ్వలసినవాళ్ళు ఏడ్చేసి మొహం కడుక్కున్నారు. ఇప్పుడు బయట ఆకాశం రోదన తప్ప మరేమీ లేదు.

చాలా మంచి బంధువులొచ్చారు అందరూ మెలకువగానే ఉన్నారు-వర్షం తగ్గగానే నా భర్త శరీరాన్ని తీసుకెళ్ళి తగలబెట్టడానికి.

నా తరఫు బంధువులెవరికీ ఈ విషయం తెలీదు ఇంకా. వాళ్ళు ఇక్కడికి రావడం కూడా నాకు ఇష్టంలేదు.

అయినా ఇంకేం మిగిలింది? ఏమీ లేదు.

ఆయన శవాన్ని తీసుకెళ్ళి తగలబెట్టేస్తే చాలు- నేను స్వతంత్ర జీవినయిపోతాను.

ఆ తరువాత నా గురించి ఎవరూ పట్టించుకోరు.

విహంగాన్నై హాయిగా స్వేచ్ఛాగగనంలో విహరిస్తాను.

స్వచ్ఛమయిన గాలిని పీలుస్తాను.

నా అణువణువునా ఆనందాన్ని నింపుకుంటాను.

నా ముఖం సంతోషంతో వెలిగిపోయింది ఒక్కసారిగా-అంతే-

"దీన్ని నిలువునా తగలెట్టినా పాపం లేదు- దొంగ...."

ఒక్క తన్ను- నా డొక్కలో-

నా యాభై ఐదేళ్ళ మామగారు-

ఈయనే కదూ-

"అమ్మాయ్- అమ్మాయ్" అని ప్రేమగా పలకరిస్తూ-ఓరోజు స్నానం చేస్తున్నపుడు -ఎవరూ లేనిది చూసి బాత్రూంలోకి తోసుకు వచ్చి తన విష మనస్తత్వం చూపి కోరిక వెల్లడి చేసింది...

అదే సమయంలో పని మనిషి రాబట్టి సరిపోయింది.

తరవాత నా కాళ్ళావేళ్ళా పడి దండాలు పెట్టి లెంపలు వేసుకుని ఎవరికీ చెప్పొద్దని బతిమాలింది?

మనిషిలోని క్షణికావేశానికీ అవసరానికీ మానవత్వం దారుణంగా రేప్ చేయబడుతోంది అన్నివేళలా-

.... ఇంకా ఎంతసేపు?

చిరాగ్గా అసహనంగా కదిలాను-

అయినా ఈ చివరి నిమిషంలో ఎందుకింత తొందర?

ఇన్నాళ్ళూ తను ఓపిక పట్టింది కదా?

చచ్చిపోయి పడిఉన్నవాడు మళ్ళీ లేస్తాడా ఏమిటీ?

ఇంక లేవడు లేమ్మా!

తన్నలేడు కూడా!

నన్ను తను ఉద్యోగం చేసే ఊరికి తీసుకెళ్ళి తను బయటికి వెళ్ళేపుడు నన్ను ఇంట్లో పెట్టి తాళం వేసి వెళ్ళిపోవడం చేస్తుండే వాడు.

ఆయనొచ్చేప్పటికి ఓ రోజో కిటికీల్లోంచి బయటికి చూస్తున్నాను. అదే నేను చేసిన పాపం!

చాకుతో అరచేతులు కోస్తే ఆరు నెలల దాకా గాయం మానలేదు-సెప్టిక్ అయ్యి.

కిటికీలకు మేకులు కొట్టి ఎప్పటికీ తెరవకుండా చేశాడు కదా?

బాల్కనీకి వెళ్ళే తలుపుకి తాళం వేసేయలేదూ?

ఓ సారి-

జాకెట్ చిరిగిపోయిందీ- కొత్తది కావాలి అని అడిగినందుకు- ఇంట్లో చీరెలూ- అన్ని బట్టలూ- నేను వాడేవీ- నా ఒంటి మీద ఉన్నవి కూడా ఊడదీసి తగలబెట్టేయలేదూ?

నేను ఏడుస్తుంటే- ఎదురుగా కూర్చుని సీసా తెర్చుకుని మత్తు ద్రవాన్ని తాగుతూ సంతోషించాడు.

ఎన్ని తప్పులు చేశాను నేను!

నిద్రపోతే తప్పు-

పోకపోతే తప్పు-

వంట తప్పు-

ఏడ్పు తప్పు-

పక్కమీద -ఖడ్గమృగంలా మీదపడి అతడు విజృంభిస్తుంటే-సున్నితమైన భాగాలని కావాలని బాధకు గురి చేస్తుంటే నేను తట్టుకోలేక మూల్గడం అతి పెద్ద తప్పు-

అన్నీ తప్పులే-

అయినా-

అన్నిటికీ సహించాను.

దేనికైనా ఓ 'చివర' ఉంటుంది. ఆ అంతం వచ్చేసింది.

నా శాంతం సహనం నిండుకున్న వేళ-

దాస్యపు శృంఖలాలను తెంపే సమయం ఆసన్నమయిందని అర్థమై-

నిన్న-

బాల్కనీలో నిలబడి షేవింగ్ చేసుకుంటూ నన్ను తిడుతున్న సమయంలో- తోసేశాను-

ఐదో అంతస్తునుండి కెవ్వున అరుస్తూ కిందపడిపోయాడు ఆయన-పడ్డవాడు మళ్ళీ లేవలేదు-

నేను ఏడవడం మొదలుపెట్టాను.

కిందకి పరుగెత్తాను. కొనప్రాణంతో ఉండి నా కేసి చూసి కన్నెర్ర చేసి మరీ పోయాడు. వెంటనే మా అత్తగారికి వార్త తెలీడం- హుటాహుటీన వాళ్ళు రావడం- శవాన్నీ నన్నూ ఊరికి తీసుకురావడం- జరిగింది.

దాన్ని తగలబెట్టనీకుండా వర్షం పడడం- మొదలయింది.

ఇప్పుడు చెప్పండి?

ఆయనపోతే నేను ఆనందించగూడదా?

పవిత్రమయిన భారతదేశంలో ఆడది మాత్రమే పతివ్రతగా ఉండాలా? మగవాడికి బాధ్యతలు లేవా?

ఇటువంటి.మగడు చస్తే అదీ తన చేతుల్లో చస్తే ఏ పతివ్రత అయినా ఆనందపడదా?

నాకు పూర్తిగా నమ్మకం ఉంది. సీత-సావిత్రి-అనసూయ ఎవరైనా ఏ పతివ్రత అయినా ఇటువంటి భర్త చస్తే పూజలు చేయరా? మనసారా సంతోషించరా?

ఆయన బ్రతికి ఉన్నంత కాలం నేను దేవుణ్ని నమ్మలేదు. ఇప్పుడు నమ్ముతున్నాను!

ఆయన పోయినందుకు నేను ఆనందపడుతున్నాను. అది తప్పా? కాదు కదూ!



నా అత్తగారికీ- మామగారికీ- ఆడబిడ్డకీ ఈ విషయం అర్థం కావడంలేదు-ఏం చేస్తాం?

మరోసారి వినుగ్గా కదిలాను. కానీ స్వేచ్ఛను పొందబోతున్నానన్న ఆనందం వల్ల వర్షం తగ్గడం కోసం ఎదురు చూడగలుగుతున్నాను.

ఇంతలో- బయట మోటార్ సైకిల్ చప్పుడయింది. తరవాత- తలుపు చప్పుడయింది-

ఎవరో తెరిచారు-

ఓ పొడుగాటి వ్యక్తి లోపలికి వచ్చాడు-

ఖాకీ రంగు ఓవర్ కోట్ ధరించి ఉన్నాడతను. ధారగా నీళ్ళు కారుతున్నాయి.

నా పేరు చెప్పి నా గురించి అడిగాడు.

నన్ను చూపించారు-

అతడు నా దగ్గిరకి వచ్చాడు.

"మీతో పర్సనల్‌గా మాట్లాడాలి" అడిగాడు.

ఇద్దరం ఓ గదిలోకి వెళ్ళాం.

అతడు కూర్చుని సిగరెట్ వెలిగించాడు.

నేను తలవంచుకుని నిలబడి ఉన్నాను.

అతడు గొంతు సవరించుకున్నాడు. "నేను పోలీస్‌ని" క్షణం ఆగి నన్ను అడిగాడు "నీల అంటే..."

"నేనే" చెప్పాను.

"మీ భర్త..."

"పోయాడు"

"ఎలాగో నాకు తెల్సు."

నా గుండె వేగంగా కొట్టుకుంది.

"మేడ మీద నుండి మీరే తోసేశారు."

నేను మాట్లాడలేదు. నా పెదవులు వణకసాగాయి.

"మీ డైరీ నేను చదివాను. తల్చుకుంటే మిమ్మల్ని అరెస్ట్ చేయగలను. కానీ చేయను. మీ తప్పుతో పాటూ దానికి కారణమూ నాకు తెల్సింది డైరీలోనే. అందుకే ఆ డైరీ తగలబెట్టేశాను. ఇప్పుడు మీరు స్వతంత్రులు."

"కృతజ్ఞురాలిని."

"నేను ఇంతదూరం వచ్చింది ఎందుకో తెల్సా మీకు" అతడు పొగవదిల్చి చెప్పాడు "మిమ్మల్ని అభినందించడానికి."

కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడతను. ఏదో గుర్తుకు తెచ్చుకుంటున్నట్లు. తరవాత అన్నాడు "నాకు ఓ చెల్లి ఉండేది. దానిది ఇదే పరిస్థితి. కానీ మీలా కాక తనే ఆత్మహత్య చేసుకుని విముక్తి పొందింది. అది చేయలేని పని మీరు చేసినందుకు నాకు ఆనందంగా ఉంది. మనిషికి- ఆడయినా, మగయినా- కావాల్సింది స్వేచ్ఛా. ఆ స్వేచ్ఛాకోసం మనిషి ఏ పని చేసినా తప్పు ఏ కాదు అని నా అభిప్రాయం. ఎందుకంటే స్వేచ్ఛ అనేది ప్రకృతి ప్రతి జీవికి ఇచ్చింది. దాన్ని మననుండి మరో మనిషి తీసుకోవడం నాకు నచ్చదు. ఈ దేశంలో నా చెల్లెల్లాంటి వాళ్ళు ఎక్కువున్నారు. మీలాంటివాళ్ళు తక్కువ. కేవలం ఓ పసుపుతాడు కట్టినంత మాత్రాన జీవితాన్ని శాసించే హక్కు ఎదుటివాడికి ఇవ్వకూడదు. అది ప్రకృతి పట్ల అపచారం చేసినట్లు. అలాగని అందరు స్త్రీలకీ బాధించే భర్తలని హత్య చేయమని చెప్పడం నా ఉద్దేశం కాదు. అలాంటి మగడికి దూరంగా పోయి స్వేచ్ఛగా బ్రతకమనే నేను చెప్పేది. తమను తమే కించపర్చుకుంటూ ఓ నీచుడికి దాస్యం చేయడంకన్నా చట్టప్రకారం విడిపోవడం మంచిది. మరో తోడు దొరకదనే భయం వద్దు. అసలు తోడే వద్దు. 'తోడు' అంటే అది బంధనమని గుర్తించాలి"

అతడు లేచి నిలబడ్డాడు.

"నేను వెళ్ళి వస్తాను- మీరు ఎక్కడికి వెళ్ళాలో చెప్తే నేను అక్కడ వరకూ మిమ్మల్ని వదులుతాను."

".... ఆయన శవం...."

అతడు నవ్వాడు "నువ్వింకా బంధనాలు తెంచుకునే ప్రయత్నం చేయడం లేదు చెల్లెమ్మా!" అన్నాడతను "స్వేచ్ఛగా బ్రతకాలంటే...."

అతణ్ని ఆపాను-

"వదండి" అన్నాను- ఇంకేం ఆలోచించే అవసరం లేనట్లు.

"కానీ ఓ విషయం."

"ఏమిటి?"

"ఒకరు స్వేచ్ఛగా బ్రతకడం చూసి మిగతా మనుషులు ఓర్వలేరు. రకరకాల మాటలూ విమర్శలూ చేస్తారు. వాటిని తట్టుకునే ధైర్యం..."

"నాకుంది."

అతడు నాకేసి ఓసారి చూసి తరవాత సిగరెట్ విసిరేసి అన్నాడు "పద- స్వేచ్ఛా ప్రపంచంలోకి. నీ టెర్మ్స్ మీద నువ్వు బ్రతకడానికి"



## పరీక్షా సమయం!

జాకీ ష్రాఫ్‌కు అన్నీ పరాజయాలే ఎదరవుతున్నాయి. 'లాట్ సాబ్' పెద్ద దెబ్బ తీసింది. 'లక్ష్మణ్ రేఖ' అతని భవిష్యత్తు రేఖను మార్చలేకపోయింది. 'అంగార్' అతని పరిస్థితులను మరి కొంచెం వేడిగా మార్చింది. 'సంగత్'లో కలెక్షన్ క్వీన్ మాధురీ దీక్షిత్ తో నటించినా ఫలితం లేకపోయింది. అతని ఆశలన్నీ ఇప్పుడు హస్తిమీదనే ఉన్నాయి. ఆ చిత్రం అతనిని 'కింగ్'గా మారుస్తుందో, లేక మామూలు 'అంకుల్'గా ప్రక్కకు నెట్టుతుందో వేచి చూడాల్సిందే!




Edited Printed and Published by D. Bheem Reddy for Kakatiya Publications, 5-8-55/A
Nampally Station Road, Hyderabad-500 001, Phone: 201181.
Madras Phone: 8252940.